హస్తకళా కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ దివ్యరావు

మాట్లాడుతున్న కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ చేతివృత్తుల డైరెక్టర్ దివ్యరావు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 20: కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న హస్తకళా కార్డులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ దివ్యరావు సూచించారు. నస్పూర్‌కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సేవా భవన్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు పలు సలహాలు, సూచనలు చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను హస్తకళ కార్డులతో దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ డిజైనర్ రాజేశ్, మందమర్రి డీవైపీఎం ఆసీఫ్, శ్రీరాంపూర్ సీనియర్ పీవో కాంతారావు, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్కే-6 గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమవేశం

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, డిసెంబర్ 20 : శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిపై గురువారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరించి, అవగాహన కల్పించారు. మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఎండీటీ సభ్యుడు కిరణ్‌కుమార్, అదనపు మేనేజర్ అమర్‌నాథ్, మహేశ్, రాజేశ్, సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, ఈఈ శ్యాంకుమార్, సీనియర్ పీవో సురేందర్, పిట్ కార్యదర్శి చిలుక రాంచందర్, నాయకులు నగేశ్ పాల్గొన్నారు.

21న సైన్స్‌ఫెయిర్

శ్రీరాంపూర్, డిసెంబర్ 20 : శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్‌లో ఈ నెల 21న సైన్స్‌ఫెయిర్ నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ జక్కెన రమేశ్, ప్రిన్సిపాల్ జాహీద్ బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ఫెయిర్‌కు శ్రీరాంపూర్, సీసీసీ పాఠశాలల విద్యార్థులు హాజరై, ప్రదర్శనలు తిలకిస్తారని తెలిపారు. విద్యావంతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'వెల్‌బేబీ షో'తో ఆరోగ్యంపై అవగాహన

- మందమర్రి ఏరియా జీఎం దేవేందర్
- సింగరేణి డే వేడుకల సందర్భంగా కేకే-1, నస్పూర్ డిస్పెన్సరీల్లో కార్యక్రమాలు
- మాదారంలో దీపాలంకరణ, ముగ్గుల పోటీలు

మందమర్రి : చిన్నారులను అప్యాయంగా పలుకరిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రి, డిసెంబర్ 20 : వెల్‌బేబీ షో కార్యక్రమంతో పిల్లల పెంపకం, మానసిక వికాసం, శారీరక ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన పెరుగుతుందని మందమర్రి ఏరియా జీఎం జీ దేవేందర్ పేర్కొన్నారు. సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని సింగరేణి కేకే-1 డిస్పెన్సరీలో శుక్రవారం నిర్వహించిన వెల్‌బేబీ షో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సేవా అధ్యక్షురాలు స్వరూపారాణితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల పెంపకం, పోషణ పట్ల తల్లిదండ్రులు నిత్యం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం సింగరేణి సీఎండీ బలరాం నాయక్ నేతృత్వంలో యాజమాన్యం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. అనంతరం డిస్పెన్సరీలో ఆధునాతన సాంకేతికతతో కూడిన రక్త పరీక్షలు నిర్వహించే సెల్‌కౌంట్ మిషిన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంవోఏఐ అధికారిని సుధారాణి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, పిల్లల వైద్య నిపుణురాలు శ్యామల, కేకే డిస్పెన్సరీ డీసీఎంవో కే నాగేశ్వర్ రావు, డీవైపీఎం ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వెల్‌బేబీ షో..

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 20 : శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ డిస్పెన్సరీలో శుక్రవారం నిర్వహించిన వెల్‌బేబీ షో ఆకట్టుకున్నది. డీవై సీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో చిన్నారులు వివిధ రకాల దుస్తుల్లో అలరించారు. ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి హాజరై, వెల్‌బేబీ షోను ఆసక్తిగా తిలకించారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు సింగరేణి దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, డాక్టర్లు మురళీధర్, లోకనాథ్‌రెడ్డి, మనీష, దవాఖాన ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదారంలో దీపాలంకరణ, ముగ్గుల పోటీలు..

తాండూర్, డిసెంబర్ 20 : మాదారం టౌన్‌షిప్‌లోని మినీ గ్రౌండ్‌లో మహిళలకు దీపాలంకరణ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఎం ఉమారాణి శ్రీనివాస్ హాజరై పరిశీలించారు. ఆకర్షణీయంగా దీపాలంకరణ, ముగ్గులు వేసిన విజేతలకు 23న సింగరేణి డే సందర్భంగా గోలేటి భీమన్న క్రీడా మైదానంలో జరిగే వేడుకల్లో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సీనియర్ సేవా సభ్యురాలు కోమల, తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్ : చిన్నారుల తల్లిదండ్రులతో జీఎం సూర్యనారాయణ దంపతులు

తాండూర్ : ముగ్గులను పరిశీలిస్తున్న సేవా అధ్యక్షురాలు ఉమారాణి శ్రీనివాస్

వయో వృద్ధులను గౌరవించాలి

- నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు
- సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌పై అవగాహన

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 20 : ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవించాలని సూచించారు. సీసీసీ నస్పూర్ విద్యానగర్ కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్పేజ్ సంస్థ కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ వయో వృద్ధులపై పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ సైండ్ల మొండయ్య.. నానమ్మ, తాతయ్యలకు మనుమలు, మనమరాళ్లతో పాదపూజ చేయించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి సింగరేణి రిటైర్డ్ సంఘం ప్రధాన కార్యదర్శి కమతం సతీశ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఎస్ఐ జితేందర్‌సింగ్, సింగిల్ విండో డైరెక్టర్ ధర్ని మధు, సిటీ కేబుల్ ఎండీ మహ్మద్ మౌలానా, పాఠశాల హెచ్ఎం బత్తిని దేవన్న, రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు నూనె మల్లయ్య, ఉపాధ్యక్షుడు కల్వల చంద్రయ్య, కోశాధికారి సిద్ధం నారాయణ, నాయకులు రాచకొండ వెంకటేశ్వర్‌రావు, సంపత్‌రెడ్డి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెల్పేజ్ కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్

శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌లో రక్షణ వారోత్సవాలు

మాట్లాడుతున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్, డిసెంబర్ 20 : శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో గురువారం 55వ రక్షణ వారోత్సవాలు నిర్వహించారు. జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, రక్షణ కమిటీ కన్వీనర్(సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం) డీ దామోదర్‌రావు, రీజియన్ సేఫ్టీ ఆఫీసర్ రఘుకుమార్ పాల్గొని, వర్క్‌షాప్‌లో సేఫ్టీ చర్యలు తనిఖీ చేశారు. అందరూ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి కొమురయ్య, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం రవీందర్, ఎస్ఈ రామిరెడ్డి, సభ్యులు రామ్మోహన్, నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, నాగసాయి సందీప్, కోదండరాం, రమేశ్, సీనియర్ పీవో శంతన, పిట్ కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో సంఘంలో ఖాళీల భర్తీ

హాజీపూర్/చెన్నూర్, డిసెంబర్ 20 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘంలో చెన్నూర్, కన్నెపల్లి యూనిట్లలో ఇటీవల బదిలీపై వెళ్లిన వారి స్థానాలను కో-ఆప్షన్ పద్ధతిలో భర్తీ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి శుక్రవారం తెలిపారు. చెన్నూర్ యూనిట్ అధ్యక్షుడిగా అభిషేక్, కార్యదర్శిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా కెంసరపు కిరణ్, కార్యదర్శిగా కే వేణుగోపాల్, కోశాధికారిగా ఎండీ తాజుద్దీన్, ఈసీ మెంబర్‌గా అఫీయా షెర్లిన్.., కన్నెపల్లి యూనిట్ అధ్యక్షుడిగా కందూరి పద్మనాభం, కార్యదర్శిగా దుర్గం వెంకటేశ్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు. వారిని జిల్లా అధ్యక్షులు శాలువా, పూలమాలతో సన్మానించారు. జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం సభ్యులు పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్మాచలం శ్రీనివాస్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, నాయకులు బొడ్డు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్, డిసెంబర్ 20 : జైపూర్ తహసీల్ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న టీఎన్‌జీవోల సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆదేశాల మేరకు అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు మందమర్రి యూనిట్‌కు సంబంధించి సభ్యత్వ నమోదు చేపట్టారు. మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, సెక్రటరీ సతీశ్‌తో పాటు, వివిధ గ్రామాల కార్యదర్శులు, రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులతో పాటుచ, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని ఒకరి మృతి

జైపూర్, డిసెంబర్ 20 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇందారం బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకరి మల్లయ్య(64) మృతిచెందాడు. ఎస్ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందారం బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా, గోదావరిఖని వైపు నుంచి అతి వేగంగా వచ్చిన బైకు ఢీ కొట్టింది. గాయపడ్డ మల్లయ్యను మంచిర్యాలలోని ప్రైవేటు దవాఖానకు, అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి, మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మంచిర్యాల జిల్లా మందమర్రిలో పోలీసులు అదుపులో ఉన్న ఆటో డ్రైవర్లు

ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ముందస్తు అరెస్టులు
- హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో అడ్డగింతలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆటోడ్రైవర్ల హెచ్చరికలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉపాధి కోల్పోయామని, హామీ మేరకు ఆర్థిక సాయం చేయాలనే డిమాండ్‌తో ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఆటోడ్రైవర్లు హైదరాబాద్‌కు తరలివచ్చారు. హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా బయల్దేరేందుకు సిద్ధమైన ఆటోడ్రైవర్లను కాస్త ముందుకు వచ్చిన తర్వాత పెట్రోల్‌బంక్ కూడలిలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఆటోడ్రైవర్లను నిర్బంధించి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఆటో జేఏసీ నాయకులను ముందుస్తుగానే అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు మారయ్య, వెంకటేశ్, సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత బస్సు స్కీమ్ తీసుకొచ్చి ఆటోడ్రైవర్లకు ఉపాధి లేకుండా చేశారని, ఆటోడ్రైవర్లను ఆదుకుంటామన్న ప్రభుత్వం దారుణంగా మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్చలకు పిలుస్తామని మాటిచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తమ ఉద్యమం ఆగదని.. ప్రభుత్వం హామీలన్ని నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్లకు ఇంత విషం ఇవ్వండి

ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

కోల్‌సిటీ, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తమ చేతులతో తమ చెంపలను కొట్టుకుంటున్నామని ఆటోడ్రైవర్ల యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గోదావరిఖనిలో విలేకరులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల ఉసురు పోసుకోవడం కంటే ఈ ప్రభుత్వ పెద్దలే తమకు ఇంత విషం ఇవ్వాలని చెప్పారు. వెంటనే ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు.

ఆటో కార్మికుల అరెస్ట్

నమస్తే నెట్‌వర్క్ డిసెంబర్ 20: సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబీకి బయలుదేరి ఆటో యజమానులు, డ్రైవర్లను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో కార్మికులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

కేటీఆర్‌ను కలిసిన ఆటోవాలాలు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 20 : హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆటోవాలాలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి తమ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుతున్నందుకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 100 మందికిపైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇకపై ఎవరూ అలాంటి పనులు చేయొద్దని భరోసానిచ్చారు. మీ సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ హామీ ఇచ్చారు.